క్లుప్తంగా

ఉచిత పశు వైద్య శిబిరం

మండవల్లి: ఉచిత పశు వైద్య శిబిరాలను పశు పోషకులు ఉపయోగించుకోవాలని పశు సంవర్థక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ వరప్రసాద్ అన్నారు. మండలంలోని నుచ్చుమిల్లిలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఏడీ వరప్రసాద్, చావలిపాడు డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ పశువులు ఎటువంటి వ్యాధుల బారిన పడకుండా పశు పోషకులు పశువులకు టీకాలు, మందులు వాడాలని సూచించారు. డాక్టర్ ప్రదీప్ పాల్గొన్నారు.

విశ్వనాద్రిపాలెంలో..

ముదినేపల్లి రూరల్: మండలంలోని పెదగొన్నూరు శివారు విశ్వనాద్రిపాలెంలో పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రొద్దువాక పశు వైద్యాధికారి కె.రామకృష్ణ శిబిరంలో పాల్గొని పశువులకు, జీవాలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

పమిడిముక్కల: అగినపర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఆ పాఠశాలలోని సోషల్ ఉపాధ్యాయులు స్టడీ మెటీరియల్ బహూకరించారు. పదిలో ఉత్తమ మార్కులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఫణికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు వేగవంతం

గుడివాడరూరల్: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ విష్ణుప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష సమావేశాన్ని శుక్రవారం ఎంపీడీఓ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణాలు, గోకులం షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. కూలీలకు వీలైనంత వరకు ఎక్కువ పని దినాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఏపీఓ రాజు పాల్గొన్నారు.

సిమెంట్ బల్ల, కుర్చీల అందజేత



కూచిపూడి(మొవ్వ): కూచిపూడి ఆరోగ్య ఉప కేంద్రానికి హెల్త్ అసిస్టెంట్ కే రామాంజనేయులు చొరవతో మాజీ సర్పంచ్ వైకేడీ ప్రసాద్ రావు జ్ఞాపకార్థం వారి కుమారులు సీతారామాంజనేయులు, శ్రీనివాస్ సిమెంట్ బల్ల, కుర్చీలు అందజేశారు. కొండవీటి అమర బాలేశ్వరావు, సోమయాజుల మురళీకృష్ణ పాల్గొన్నారు.

మినుము పంట పరిశీలన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో మినుము పొలాల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి శుక్రవారం రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మినుములో అక్కడక్కడా పల్లాకు తెగులును ఆమె గమనించారు. ఈ తెగులు తెల్ల దోమ మాత్రమే వ్యాప్తి చెందుతుందన్నారు. తెల్లదోమ నివారణకు ఎసిటామిప్రైడ్ 0.2 గ్రాములు ఒక లీటరు నీటికి కలిపి ఉద్ధృతిని బట్టి 10, 15 రోజులకోసారి పిచికారీ చేయాలని సూచించారు. ఏఓ షేక్ జరీనా, వీఏఏ గోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన

గుడ్లవల్లేరు: రోడ్డు భద్రతపై ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సును శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కాలేజీలో శుక్రవారం ఎస్ఐ ఎన్.వి.వి.సత్యనారాయణ నిర్వహించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని నిర్వహించిన ఈ సమావేశంలో ట్రాఫిక్ నిబంధలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కోదండరామారావు పాల్గొన్నారు.

నందివాడలో..

నందివాడ: జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా, హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్ ఉపయోగాన్ని తప్పనిసరి చేస్తూ నందివాడ ఎస్ఐ శ్రీనివాసు ఆధ్వర్యంలో శుక్రవారం జనర్ధనపురం సెంటర్లో ద్విచక్రవాహనదారులు, ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లో పాటించాల్సిన నియమాలను వివరించారు.

డాక్టర్ నరసింహారావు విగ్రహావిష్కరణ



కైకలూరు: పేదలకు వైద్య సేవలు అందించడంలో డాక్టర్ బత్తిన నరసింహారావు(కాళ్లపాలెం డాక్టర్) సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కొనియాడారు. ఆంధ్ర, తెలంగాణ రాధా, రంగా మిత్రమండలి చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు పన్నాస పూర్ణచంద్రరావు ఆర్థిక సాయంతో కాళ్లపాలెంలో డాక్టర్ విగ్రహాన్ని శనివారం ప్రారంభించారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, బుల్లయ్య, సత్యవతి, మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడలో కాపుల బజార్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే వర్లకుమార రాజా శుక్రవారం ప్రారంభించారు. తహసీల్దార్ వై.రంగారావు, ఎంపీడీఓ టీ.సీతామహాలక్ష్మి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన

ఆహార సలహా సంఘ సమావేశాలు

కూటమి ప్రభుత్వం దెబ్బకు ఆహార సలహా సంఘ సమావేశాలు అటకెక్కాయి. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సిన సమావేశాలను అధికార పార్టీ నేతల ఒత్తిళ్లతో అధికారులు నిర్వహించడం లేదు. ప్రశ్నించేవారు లేకపోవడంతో నిత్యావసర సరుకుల పంపిణీలో అవినీతి పెరిగిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఎనిమిది నెలలు గడుస్తున్నా నిర్వహించని సమావేశాలు



గుడివాడ ఆర్డీఓ కార్యాలయం

గుడివాడరూరల్: గుడివాడ నియోజకవర్గంలో ఆహార సలహా సంఘ సమావేశాలు నిర్వహించకపోవడంతో దీర్ఘకాలికంగా ఉన్న ప్రజా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఆహార సలహా సంఘ సమావేశం ప్రజా సంఘాలు, అన్ని వర్గాలు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం సమావేశాలను నిర్వహించడం లేదు. దీంతో రేషన్ సరుకులు, గ్యాస్, డీజిల్, పెట్రోల్ సరఫరాల్లో ఇబ్బందులను ఈ సమావేశాల్లో ప్రజల తరఫున ఆహార సలహా సంఘ కమిటీ సభ్యులు చర్చించే అవకాశం లేకుండా పోయింది. రేషన్ కార్డుల లబ్ధిదారులు, గ్యాస్ వినియోగదారులు, మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు సమస్యలు వచ్చినా పట్టించుకునే దిక్కు లేకుండా పోయింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్డీఓ అధ్యక్షతన ఆహార సలహా సంఘ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ కమిటీలో అన్ని రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులను ప్రతి మండలం నుంచి నియమిస్తారు. అలాంటి కమిటీ ఏర్పాటు, సమావేశాలు కానీ నిర్వహించలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సమావేశంపై అధికారులకు ఏ మాత్రం శ్రద్ధ లేదని స్పష్టమవుతోంది.

67,332 తెల్ల రేషన్‌కార్డులు

గుడివాడ నియోజకవర్గంలోని గుడివాడ అర్బన్, మండలం, గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లో 143 రేషన్ దుకాణాలు ఉన్నాయి. మొత్తం రేషన్ కార్డులు 67,332కు పైగా ఉన్నాయి. 46 ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులను పంపిణీ చేస్తున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో ప్రజల చెంతకే రేషన్ సరుకులు వెళ్లాలనే సదుద్దేశంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ వాహనాలకు కూడా త్వరలోనే మంగళం పాడేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. రేషన్ షాపులకు పౌర సరఫరాల శాఖ సరఫరా చేస్తున్న సరుకులు సక్రమంగా అందుతున్నాయా? లేదా అనే జవాబుదారీ తనం లేకుండా పోయింది. అధికారులు నిర్లక్ష్యం, అశ్రద్ధ వహించడంతో నియోజకవర్గంలో నిత్యావసర సరుకుల సరఫరా ఇష్టానుసారంగా చేస్తున్నట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు. నియోజకవర్గంలోని రేషన్ షాపులన్నీ అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే పని చేస్తుండటంతో అధికారులు కూడా తనిఖీలు చేయడానికి ముందుకు రావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొత్తగా రేషన్ షాపులకు ఆహ్వానం పలికినా అధికార పార్టీ అండదండలు ఉన్న వారికే ఆ దుకాణాలు దక్కుతాయనే ఆరోపణలున్నాయి.

పంపిణీలో అవినీతి

ఆహార సలహా సంఘ సమావేశాలు నిర్వహిస్తే సమావేశాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో జరుగుతున్న లోటుపాట్లను చర్చించి, సరుకుల పంపిణీకి అంతరాయం లేకుండా చేయడమేకాకుండా అందులో జరిగే అవినీతిని అరికట్టే అవకాశం ఉండేది. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గత మూడు నెలలకోసారి సమావేశాలు నిర్వహించేవారు. ఈ సమావేశాల్లో సభ్యుల సలహాలు తీసుకుని ఇబ్బందులు ఉంటే పరిష్కారం చేసేవారు. దీని వలన ప్రజలకు నిత్యావసర సరుకులు ఇబ్బంది లేకుండా అందేవి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్‌షాపులు, గ్యాస్, పెట్రోల్ బంక్‌లు ఇతర సరుకుల పంపిణీలో అధికార పార్టీ నాయకులు తలదూర్చి అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రేషన్ బియ్యం పంపిణీలోనూ అక్రమాలు జరుగుతున్నాయి. అడ్డగోలుగా బ్లాక్‌లో గ్యాస్ విక్రయాలు, చివరికి రైతుబజారుల్లోనూ అడ్డగోలుగా రేట్లు పెంచి అమ్మకాలు చేసి వినియోగదారుల జేబులకు చిల్లులు పొడుస్తున్నారు. మాంసం విక్రయాలు, హోటళ్ల నిర్వహణ సైతం కూటమి నాయకులు తలదూర్చి ప్రజారోగ్యాన్ని హరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కళ్లు తెరిచి ఆహార సలహా సంఘ సమావేశాలు నిర్వహించి ప్రజలకు నిత్యావసర సరుకులు సక్రమంగా అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సమావేశాలు నిర్వహించకపోవడం శోచనీయం



గతంలో ఆహార సలహా సంఘ సమావేశాలు క్రమం తప్పకుండా జరిగేవి. మూడునెలలకోసారి సమావేశాన్ని అధికారులు నిర్వహించేవారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తే సమస్యలు పరిష్కారించేవారు. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేకపోవడం శోచనీయం.

– ఆర్సీపీ రెడ్డి, సీపీఎం నాయకుడు

సమావేశాలను పూర్తిగా పక్కన పెట్టేశారు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఆహార సలహా సంఘ సమావేశాలను నిర్వహించకుండా పూర్తిగా పక్కన పెట్టేశారు. ప్రజలకు అవసరమైన విషయాలను చర్చించే సమావేశాలను నిర్వహించకపోవడం అన్యాయం. ఇప్పటికైనా సలహా సంఘానికి అన్ని మండలాల నుంచి రాజకీయ పార్టీల ప్రతినిధులను నియమించాలి.

– మట్టా జాన్‌విక్టర్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గుడివాడ టౌన్: గుడివాడ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ మరమ్మతులు నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎలక్ట్రికల్ ఈఈ జీబీ శ్రీనివాస రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

మొవ్వ: ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని పామర్రు సీఐ వి సుభాకర్ విద్యార్థులకు సూచించారు. కూచిపూడి ఎస్ఐ ఎం సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో స్థానిక వేమూరి సుందరరామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో విద్యార్థులకు రోడ్డు భద్రత, వాహనదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

హెల్మెట్ల వాడకంపై నేడు ర్యాలీ

కైకలూరు: హెల్మెట్ల వాడకంపై కైకలూరు సీఎన్నార్ గార్డెన్ నుంచి ట్రావెలర్స్ బంగ్లా వరకు పోలీసులు, ప్రజాప్రతినిధులు శనివారం ర్యాలీగా బయలుదేరుతారని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ కార్యాలయ సిబ్బంది శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏలూరు రేంజ్ డీజీపీ అశోక్‌కుమార్, ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్‌తోపాటు ఎంపీ మహేష్ యాదవ్ ఎమ్మెల్యేలు హాజరవుతారని పేర్కొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు గంగారావు మృతి

పమిడిముక్కల: పైడికొండలపాలెం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు మైనేని గంగారావు(86) శుక్రవారం మృతిచెందాడు. ఆయనకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. గంగారావు కుమారుడు మైనేని కోటేశ్వరరావు వైఎస్సార్ సీపీ నాయకుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు. గంగారావు మృతికి మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం, వైఎస్సార్ సీపీ నాయకులు సంతాపం ప్రకటించారు.

బాలికా సంరక్షణ అందరి బాధ్యత

గుడివాడరూరల్: బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి విజయఫ్లోరెన్స్ అన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పట్టణంలోని టంగుటూరి ప్రకాశం గాంధీ మున్సిపల్ హైస్కూల్లో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. బాలికలకు గుడ్‌టచ్ బ్యాడ్ టచ్ గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భవానీ, యూనియన్ నాయకురాలు గీత పాల్గొన్నారు.

పామర్రులో..

జమీగొల్వేపల్లి(పామర్రు): బాలికలు అన్ని రంగాల్లో రాణించి ఉన్నతులుగా ఎదగాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి జెడ్పీ హైస్కూల్లో పెదమద్దాలి, జమీగొల్వేపల్లి అంగన్‌వాడీ సిబ్బంది ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బాలికల అభ్యున్నతి కోసం ప్రభుత్వాలు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నాయన్నారు.

మోటూరు అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలో..

గుడివాడరూరల్: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మోటూరు అంగన్‌వాడీ సెక్టార్ పరిధిలోని చౌటపల్లి, దొండపాడు, మోటూరు గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గ్రామ జెడ్పీ పాఠశాల విద్యార్థులు, కిషోర బాలికలతో శుక్రవారం గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు.

నందివాడలో..

నందివాడ: బాలికా సంరక్షణ అందరి బాధ్యత అని నందివాడ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగ శిరీష అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ బాలిక దినోత్సవం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినులతో సైకిల్ ర్యాలీ నిర్వహించారు.



గుడివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీఓ, విద్యార్థినులు

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

పమిడిముక్కల: బాలికలు అన్ని రంగాల్లో రాణిస్తే, సమాజంలో ఉన్న లింగ వివక్షత తొలగుతుందని ఐసీడీఎస్ పామర్రు సూపర్‌వైజర్ అనిత అన్నారు. తాడంకి హైస్కూల్లో బాలిక దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సఖి, వన్‌స్టాప్ సెంటర్ గురించి బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవికుమార్, రాజ్యలక్ష్మి, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మండవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో కైకలూరు ప్రాజెక్ట్ అధికారి వి.దీప్తి ఆధ్వర్యంలో కిషోర బాలికలకు వ్యాసరచన పోటీలు, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ బహుమతులు ఎంఈఓ ఎస్.రత్నసునాథం, ఎంపీడీఓ కె.రామలింగేశ్వరరావు, హెచ్ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సూపర్‌వైజర్ సీహెచ్ నాగలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: చిన్నారుల దీర్ఘకాలిక సంరక్షణ కోసం చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు కాల్ చేసి సేవలను పొందవచ్చునని సీడీపీఓ డీ సుధారాణి పేర్కొన్నారు. మొవ్వలోని శ్రీ మండవ కనకయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల్లో శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి నిర్వహించిన ర్యాలీలో హెచ్ఎం ఎస్ శ్రీదేవి, సెక్టార్ సూపర్‌వైజర్ ఏనుగు పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో..

ముదినేపల్లి రూరల్: విద్యా ప్రాముఖ్యతను గుర్తించి పాఠశాలలకు బాలికలను విధిగా పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రసూన అన్నారు. మండలంలోని బొమ్మినంపాడు హైస్కూల్లో బాలికా దినోత్సవం హెచ్ఎం శ్రీలక్ష్మీ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యురాలు అరుణ కుమారి పాల్గొన్నారు.

సృష్టికి మూలం అమ్మ

గుడ్లవల్లేరు: ఆడపిల్ల అంటే మరొక అమ్మ.. అమ్మే సృష్టికి మూలం .. ఆ అమ్మను రక్షించుకుందామని విద్యార్థులు నినదించారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వాణి ఆధ్వర్యంలో గుడ్లవల్లేరులో అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్లో శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం. శివనాగమణి మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు.

విన్నకోటలో పోస్టల్‌కు పూర్వ వైభవం తెస్తాం



గుడ్లవల్లేరు: విన్నకోటలో పోస్టల్ శాఖకు పూర్వ వైభవం తెచ్చి, మళ్లీ ఖాతాదారుల ఆదరాభిమానాలు పొందుతామని పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ అన్నారు. శుక్రవారం ఆయన విన్నకోట పోస్టాఫీసుకు వచ్చారు. పోస్టల్ ఖాతాదారులకు చెందిన 145పాసు పుస్తకాలను ఆయన సేకరించారు. గతంలో విన్నకోటలో జరిగిన పోస్టల్ స్కామ్‌పై స్పందించారు. కొన్ని చీడ పురుగులు తమ స్వార్థం కోసం పోస్టల్ ఖ్యాతిని చెరిపివేసేందుకు ఎన్ని స్కామ్‌లు చేసినా అది సాధ్యమయ్యేది కాదన్నారు. గతంలో ఖాతాదారుల వద్ద కాజేసిన సొమ్ము మొత్తాన్ని వారికి చెల్లించేందుకే ఈ బుక్స్‌ను ఉన్నతాధికారులకు సమర్పిస్తున్నామని చెప్పారు. ఈ స్కామ్ చేసిన నిందితుడు రాజా నుంచి గతంలోనే రూ.17.50 లక్షలను ఉన్నతాధికారులు రికవరీ చేశారన్నారు.

ఉన్నత చదువులతోనే జీవితంలో స్థిరత్వం

గుడివాడరూరల్: ఉన్నత చదువులు అభ్యసించడం ద్వారానే జీవితంలో స్థిరపడతారని ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల కామర్స్ విభాగాధిపతి బీవీఆర్‌డీ ఫణికుమార్ అన్నారు. స్థానిక ఏఎన్ఆర్ కళాశాల్లో ఎంబీఏ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కెరియర్ పురోగతికి సంబంధించిన అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతమైన చదువులు చదవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీజేఎస్ కుమార్, పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్ఆర్‌కే ప్రసాద్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర గుడివాడ సాకారానికి సహకరిస్తా

గుడివాడరూరల్: స్వచ్ఛ గుడివాడ సాకారానికి అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తానని ఏపీ స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. గుడివాడ డంపింగ్‌యార్డ్‌ను, పురపాలక సంఘ పరిధిలోని పలు ప్రాంతాలను ఎమ్మెల్యే వెనిగండ్ల రాముతో కలసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడను చెత్త రహిత పట్టణంగా చేసేందుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము చెత్త సేకరణ, డంపింగ్ నిర్వహణ, ఇతర అవసరాలకు కావాల్సిన నిధులపై పట్టాభికి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస రావు, కూటమి నాయకులు పెద్దు శ్రీకాంత్, చేకూరి జగన్మోహనరావు పాల్గొన్నారు.



టెలిఫోన్‌నగర్‌లో డంపింగ్‌యార్డ్‌ను పరిశీలిస్తున్న కొమ్మారెడ్డి, ఎమ్మెల్యే రాము

ఫార్మసీ విద్యార్థిని విజయకేతనం

గుడ్లవల్లేరు: స్థానిక వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీకి చెందిన విద్యార్థిని మహ్మద్ మైమున్నీసా అంతర్జాతీయ సదస్సులో విజయ కేతనం ఎగురవేసింది. ఈ విషయాన్ని శుక్రవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. ఈ నెల 22, 23వ తేదీల్లో మంగళగిరి నిర్మల ఫార్మసీ కళాశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో మైమున్నీసా నొప్పుల నుంచి ఉపశమనం పొందటానికి వినియోగించే నెఫోపామ్, పారాసెటమాల్ ఔషధాల మోతాదును నిర్వహించే పద్ధతులపై తలపడిందన్నారు. ఆ అంశంపై ఈ-పోస్టర్‌ను ప్రదర్శించి ప్రథమ స్థానం సాధించి బహుమతితో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్నట్లు తెలిపారు.



మైమున్నీసాను అభినందిస్తున్న డాక్టర్ లక్ష్మణరావు, డాక్టర్ ప్రశాంతి

ముగిసిన అంతర్జాతీయ వెబినార్

కైకలూరు: సైన్స్ విభాగ పరిశోధనలపై కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో గురువారం ప్రారంభమైన అంతర్జాతీయ వెబినార్ శుక్రవారంతో ముగిసింది. చివరిరోజు ఐర్లండ్ డబ్ల్యూఎస్ సిటీ యూనివర్సిటీకి చెందిన పోస్ట్ డాక్టరేట్ ఫెలో అరుల్ మణికందన్ పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థ జలాల నుంచి బయో ప్లాస్టిక్ పదార్థాల తయారీని వివరించారు. ఇశ్రాయేలు ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ జి.జస్వంత్ భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే పదార్థాల గురించి తెలిపారు. కృష్ణ యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పి.వీరబ్రహ్మాచారి, కైకలూరు ప్రిన్సిపాల్ వై.శ్రీలత పాల్గొన్నారు.

తాగునీటి వాటర్ ట్యాంక్ వితరణ

కైకలూరు: ప్రజల తాగునీటి అవసరాలకు బుడా సాహెబ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఎండీ గాలిబ్‌బాబు సహకారంతో పెద్ద మసీదు ఆవరణలో వాటర్ ట్యాంకర్‌ను జనాబ్ ముఫ్తి ఎండీ, ఈనాఉల్ హక్ శుక్రవారం ప్రారంభించారు. దాత మాట్లాడుతూ మరిన్ని కార్యక్రమాలు ట్రస్టు ద్వారా అందిస్తామన్నారు. పెద్దలు ఎంఏ రహీం, షేక్ రఫీ, అమీర్, ఖుర్షీద్, జహీర్, మున్నా పాల్గొన్నారు.

కూటమి నేతలకు కొల్లేరు కుంపటి

- నేతల హామీలపైనే కొల్లేరు వాసుల ఆశలు
- సుప్రీం కోర్టుకు 90 రోజుల నివేదికపై అధికారుల మల్లగుల్లాలు
- ఆందోళనకు సిద్ధమంటున్న కొల్లేరు గ్రామాలు

కైకలూరు: కొల్లేరు తేనెతుట్టు మళ్లీ కదిలింది. ఈ సారి ఏకంగా కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలకే సుప్రీంకోర్టు కొల్లేరు ఆక్రమణలపై కన్నెర్రజేసింది. ఏలూరు జిల్లాలో కొల్లేరు గ్రామాలు కలిగిన నియోజకవర్గాలైన కైకలూరు, ఉంగుటూరు, దెందులూరు, ఉండి, పాక్షికంగా ఉన్న ఏలూరు అభ్యర్థుల విజయాల్లో కొల్లేరు గ్రామాల ఓట్లు కీలకంగా మారాయి. కూటమి ప్రభుత్వంలో కొల్లేరు సమస్యలు తీరుతాయని భావిస్తున్న తరుణంలో పర్యావరణ వేత్త మృత్యుంజయరావు వేసిన పిల్ రూపంలో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు కొల్లేరు ప్రజలకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. కొల్లేరు ప్రజలు కూటమి నాయకుల హామీలపై గంపెడాశతో ఎదురు చూస్తున్నారు. బీజేపీ పెద్దలతో సన్నిహిత సంబంధాలు కలిగిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, ఉండి ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, జనసేన ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, చింతమనేని ప్రభాకర్‌తో పాటు ఏలూరు, నరసాపురం ఎంపీలు మహేష్ యాదవ్, శ్రీనివాస వర్మ సాయపడతారని కొల్లేరు వాసులు భావిస్తున్నారు. ఇక ముఖ్యమంత్రి చంద్రబాబుగా ఉన్న 1999లో కొల్లేరుకు గుదిబండగా మారిన జీఓ 120 వచ్చింది. టీడీపీ పాలనలోనే 2014లోనూ కొల్లేరు అంశం వివాదాస్పదంగా మారింది. తాజాగా చంద్రబాబు కూటమి ప్రభుత్వంలో ఇదే కొల్లేరు సమస్య ఉత్పన్నమైంది.

కొల్లేరులో 'పవనిజం' పని చేసేనా..

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యావరణ, అటవీశాఖ మంత్రిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన శుక్రవారం మీడియాలో అటవీ ఆస్తుల సంరక్షణకు ఎటువంటి చర్యలైనా తీసుకుంటామని ప్రకటించారు. ఓ పక్క అత్యున్నత న్యాయస్థానం కొల్లేరులో ఆక్రమణలను నేరుగా ప్రస్తావించడంపై మంత్రిగా పవన్ కల్యాణ్ ఎటువంటి అభిప్రాయం వ్యక్తం చేస్తారనే అంశం కొల్లేరు ప్రజలతో పాటు స్థానిక నాయకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

కొల్లేరు గ్రామాల్లో ఆందోళన తప్పదా..

కొల్లేరు ఆపరేషన్ సమయంలో కొట్టేసిన జిరాయితీ, డీ-ఫాం పట్టా భూములకు నష్ట పరిహారం చెల్లించకుండా ప్రభుత్వాలు కాలయాపన చేయడం వల్లే బతుకుదెరువు కోసం చెరువులు తవ్వుకున్నామని కొల్లేరు ప్రజలు చెబుతున్నారు. అసలు కాంటూరు లెక్కల్లోనే తేడా ఉందంటున్నారు. బుడమేరు నీరు సముద్రానికి చేరకపోవడానికి కొల్లేరులో కేవలం అక్రమ చేపల చెరువులే కాదని డ్రెయిన్లను బాగు చేయలేదని అంటున్నారు. కైకలూరు నియోజకవర్గంలో కొల్లేరు ఆపరేషన్ సమయంలో అదనంగా 7,500 ఎకరాలు ధ్వంసం చేశారని, వాటిని పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తమ జీవనోపాధి చేపల చెరువులను తొలగిస్తే అడ్డుకుంటామని కొల్లేరు నాయకులు హెచ్చరిస్తున్నారు.